సాక్షి
పెద్దపల్లి
ఆదివారం । 24 । మార్చి । 2024



వైభవంగా విగ్రహ ప్రతిష్ఠాపన

గోదావరిఖని: భగత్‌సింగ్‌నగర్‌లో పోచమ్మ విగ్రహ ప్రతిష్ఠాపనలో ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్‌–మనాలి ఠాకూర్‌ దంపతులు పాల్గొన్నారు.

రంజాన్‌ వేళలు

	ఇఫ్తార్ ఆది (సా॥)	సహర్ సోమ (ఉ॥)
కరీంనగర్	6.26	4.47
పెద్దపల్లి	6.06	4.41
రాజన్న సిరిసిల్ల	6.33	4.55
జగిత్యాల	6.33	4.54

గరిష్ఠం/కనిష్ఠం
37.7.0/22.1

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. పగలు ఎండగా, ఉక్కపోతగా ఉంటుంది. రాత్రి చలిగా ఉంటుంది

మత్తు జోరు.. బెట్టింగ్‌ హోరు

- ఉమ్మడి జిల్లాను చీడల్లా వెంటాడుతున్న జాఢ్యాలు
- జగిత్యాలలో వరుస ఘటనలతో కలవరం
- ఐపీఎల్‌తో మొదలైన ఆన్‌లైన్‌ బెట్టింగ్‌
- క్రెడిట్‌కార్డుల వినియోగం, ఆపై అప్పుల పాలు
- ఒత్తిడి పెరిగి డిప్రెషన్‌లోకి బెట్టింగ్‌బాబులు



సాక్షిప్రతినిధి,కరీంనగర్‌:

ఉమ్మడి కరీంనగర్‌ జిల్లాలో యువతను రెండు జాఢ్యాలు వెంటాడుతున్నాయి. ఒకటి గంజాయి, మరోటి బెట్టింగ్‌. జగిత్యాలలో బాలిక గంజాయికి బానిసైన తీరు రాష్ట్రవ్యాప్తంగా కలకలం రేపింది. అదే సమయంలో కరీంనగర్‌ జిల్లాకేంద్రంలో ఈ వారంలో ఆన్‌లైన్‌ గేమ్స్‌లో మితిమీరిన అప్పులు చేసి, తీర్చే మార్గం తెలియక ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబ సభ్యులు వాస్తవాలు వెల్లడించకపోయినా.. ఇలాంటి ఘటనలు వెలుగుచూస్తున్నాయి. తక్కువ కాలంలో కోటీశ్వరులు కావాలన్న అత్యాశతో బెట్టింగ్‌ వైపు, మత్తులో విహరించి లోకాన్ని ఏలాలన్న కోరికతో కొంత మంది యువత గంజాయి, మత్తు పదార్థాలకు బానిసకావడం ఆందోళన కలిగిస్తోంది.

లోన్‌ యాప్స్‌, క్రెడిట్‌ కార్డ్స్‌తో బెట్టింగ్‌..

ఇక ఉమ్మడి జిల్లా యువతలో కొందరు ఎదుర్కొంటున్న ప్రాణాంతక జాఢ్యం బెట్టింగ్‌. దీంతోపాటు ఆన్‌లైన్‌ గేమింగ్స్‌ కూడా. ప్రస్తుతం ఐపీఎల్‌ సీజన్‌ మొదలైంది. ఇది రెండునెలలపాటు సాగనుంది. ఇప్పటికే తెలివిగా బెట్టింగ్‌ యాప్స్‌ నిర్వాహకులు ప్రచారం ప్రారంభించారు. ఫలానా కూలీకి బెట్టింగ్‌లో ఇన్ని రూ.కోట్లు వచ్చాయని, బిచ్చగాళ్ల బిలియనీర్లు అయ్యారని సోషల్‌ మీడియాలో ప్రచారం. వాస్తవానికి యువతను యాప్స్‌ వైపు లాగేందుకు ఇదో ఎత్తుగడ. ఇందులో వీరు ప్రతీసారి సక్సెస్‌ అవుతుండటం గమనార్హం. సరే బెట్టింగ్‌ యాప్‌ డౌన్‌లోడ్‌ చేశాక..బెట్టింగ్‌ కోసం డబ్బు ఎలా? చేతిలో ఉన్నా డబ్బు సరిపోదు, అందుకే ఈ సమయంలోనే ఎలాంటి సంపాదన లేకుండా రూ.లక్షల కొద్దీ లిమిట్‌ ఇస్తూ ఉత్తపుణ్యానికి అంటగడుతున్న క్రెడిట్‌ కార్డ్స్‌, ఎలాంటి ష్యూరిటీ లేకుండా రూ.లక్షలు అప్పు ఇస్తున్న మనీలోన్‌ యాప్స్‌ను వీరు ఆశ్రయిస్తున్నారు.

తీర్చలేక తీవ్ర నిర్ణయాలు..

గంజాయికి అలవాటు పడ్డ వాళ్లు నేరాలు చేస్తూ బహిరంగంగానే దొరికిపోతున్నారు. ఆన్‌లైన్‌ గేమ్స్‌, బెట్టింగ్‌కు చేతిలో డబ్బులు లేకున్నా.. లోన్‌యాప్స్‌, క్రెడిట్‌ కార్డ్స్‌లను వాడి రూ.లక్షలు అప్పులు చేస్తున్నారు. వీటిని తిరిగి తీర్చాలన్నపుడు అసలు కథ మొదలవుతుంది. కొందరు మరోచోట అప్పుచేసి కడుతుండగా మరికొందరు పొగొట్టుకున్న చోటే రాబట్టుకుందామన్న సిద్ధాంతంతోనే, లేక ఎలాగూ మునిగాం కదా అని మరింత అప్పు చేసి పీకల్లోతు ఊబిలోకి కూరుకుపోతున్నారు. ఈక్రమంలోనే వీరు ఒత్తిడికి గురవుతున్నారు. బ్యాచిలర్లయితే ఆత్మహత్యలకు పాల్పడటం లేదా వివాహితుల్లో కొందరు పెళ్లాం పిల్లలను చంపి తాము చావడం లాంటి అఘాయిత్యాలకు పాల్పడుతున్నారు. రూ.లక్షలు అప్పు చేస్తున్న వారంతా ఉన్నత విద్యావంతులు, ప్రభుత్వ ఉద్యోగులు కావడం ఇక్కడ గమనార్హం.

గంజాయి విక్రేత అరెస్ట్‌

జగిత్యాలక్రైం: జగిత్యాల అర్బన్‌ మండలం ధరూర్‌ శివారులో శనివారం సాయంత్రం అనుమానాస్పదంగా తిరుగుతున్న వ్యక్తిని అదుపులోకి తీసుకుని అతని వద్ద నుంచి 260 గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు సీఐ ఆరిఫ్‌ అలీఖాన్‌, రూరల్‌ ఎస్సై సదాకర్‌ తెలిపారు. జగిత్యాల అర్బన్‌ మండలం తిప్పన్నపేటకు చెందిన మైదం అజయ్‌ శనివారం సాయంత్రం ధరూర్‌ శివారులో అనుమానాస్పదంగా తిరుగుతుండగా పోలీసులకు సమాచారం అందింది. ఎస్సై సదాకర్‌ అక్కడకువెళ్లి అజయ్‌ని తనిఖీ చేయగా అతని వద్ద 260 గ్రాముల గంజాయి లభ్యమైంది. గంజాయిని స్వాధీనం చేసుకుని అజయ్‌పై కేసునమోదు చేసినట్లు సీఐ వివరించారు.

కలెక్టర్‌, ఎస్పీ సీరియస్‌

గంజాయికి బానిసైన బాలిక విషయంపై మీడియాలో భిన్న కథనాలు రావడంతో జగిత్యాల కలెక్టర్‌ యాస్మిన్‌ బాషా, ఎస్పీ సన్‌ప్రీత్‌సింగ్‌ తీవ్రంగా పరిగణించారు. ఇటీవల ఇదే జిల్లాకేంద్రంలో ఓ ఈఎన్టీ ఆసుపత్రి వైద్యుడు మార్ఫిన్‌ ఇంజెక్షన్లను అడ్డదారిలో అమ్ముతూ దొరికిపోయిన విషయం తెలిసిందే. జిల్లాలో వరుసగా ఇలాంటి ఘటనలు చోటుచేసుకోవడం ఆందోళనకరం. నివారణ చర్యలు చేపట్టడంతోపాటు, జరుగుతున్న ప్రచారంపైనా నిశితంగా నిఘా ఉంచారు. బాలిక మతిస్థిమితం తప్పేంతలా గంజాయి వినియోగించడంపై సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతోంది. బాలికకు అంత గంజాయి ఎలా వచ్చింది? ఎవరు విక్రయించారు? ఎవరు అలవాటు చేశారు? తదితరు విషయాలపై పోలీసులు కూపీ లాగుతున్నారు. ఈ విషయంలో ఇప్పటికే పలువురిని అరెస్టు చేశారు. మరోవైపు కరీంనగర్‌ జిల్లాకేంద్రం, శివారులోని తిమ్మాపూర్‌, కొత్తపల్లి, చొప్పదండిలో వివిధ కాలేజీలో చదువుతున్న విద్యార్థులు గంజాయికి అలవాటు పడ్డారు. చాలామంది కేవలం గంజాయి తాగేందుకే ప్రత్యేకంగా రూములు అద్దెకు తీసుకుంటున్నారంటే వీరి జల్సాలు ఏ స్థాయిలో ఉన్నాయో అర్థం చేసుకోవచ్చు. గతంలో చొప్పదండిలో ఇలాంటి స్థావరాలపై పోలీసులు దాడి చేసినా.. గంజాయివీరుల తీరులో మార్పు రావడం లేదు. వీరిలో చాలామంది పోలీసులకు అనేకసార్లు పట్టుబడ్డారు. వీరిలో కొందరు దీన్నే వృత్తిగా స్వీకరించి, సులువుగా డబ్బు సంపాదించేందుకు శాశ్వతంగా గంజాయి పెడ్లర్ల అవతారమెత్తడం గమనార్హం. గంజాయి ఏజెన్సీ ప్రాంతాల నుంచి మంచిర్యాల, మంథని, భూపాలపల్లి మీదుగా జగిత్యాల, సిరిసిల్ల, కరీంనగర్‌ తదిరల ప్రాంతాలకు సరఫరా అవుతోంది.

సాఫ్ట్‌వేర్‌ కంట్రోల్‌ చేస్తుంది



ఆన్‌లైన్‌ బెట్టింగ్‌, గేమింగ్‌ యాప్స్‌ విషయంలో గమనించాల్సింది ఏంటంటే అవతల ఆడేది కంప్యూటరే. దానిలోని సాఫ్ట్‌వేర్‌ ముందు గెలిపించి, తరువాత ఓడిపోయేలా చేస్తుంది. ఈ విషయం తెలియక చాలా మంది ముందు తాము ఏదో గెలిచామన్న భావనతో అప్పులు చేసి గేమ్స్‌ ఆడుతారు. ఇదంతా పథకం ప్రకారం జరిగే ప్రక్రియ. ఒత్తిడి భరించలేక యువత ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. ఇలాంటి ప్రమాదకర బెట్టింగ్‌ యాప్స్‌పై ప్రభుత్వం సైతం అవగాహన కల్పించాలి. – వీరేందర్‌, సైకాలజిస్ట్‌

న్యూస్‌రీల్‌

లింగ నిర్ధారణ నేరం



మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో ప్రమోద్‌కుమార్‌

పెద్దపల్లిరూరల్‌: గర్భస్థ లింగ నిర్ధారణ నేరమని జిల్లా వైద్యాధికారి ప్రమోద్‌కుమార్‌ అన్నారు. రాఘవాపూర్‌, రాగినేడు పీహెచ్‌సీ వైద్యసిబ్బంది, టీబీ సిబ్బందికి గర్భస్థ లింగ నిర్ధారణ చట్టంపై శనివారం అవగాహన కల్పించారు. గర్భస్థ లింగనిర్ధారణ, భ్రూణ హత్యలకు పాల్పడేవారికి మూడేళ్లపాటు జైలు శిక్ష, రూ.10వేల జరిమానా విధిస్తారన్నారు. ఎంటీపీ చట్టం ప్రకారం రిజిస్ట్రేషన్‌ చేసుకున్న వారే ఎంటీపీ చేయాలని, వారు అనవసరంగా ఆపరేషన్లు చేస్తే ఈ చట్టం కింద శిక్షార్హులేనని అన్నారు. డాక్టర్‌ సుధాకర్‌రెడ్డి, స్వప్న, డోరకమ్మ, వెంకటేశ్వర్లు, ప్రతాపరెడ్డి, మధుసూదన్‌, ప్రభాకర్‌, రాజేందర్‌ పాల్గొన్నారు.

ప్రశాంతంగా టెన్త్‌ పరీక్షలు

పెద్దపల్లిరూరల్‌: జిల్లాలో పదో తరగతి పరీక్షలు ప్రశాంతంగా జరుగుతున్నాయి. శనివారం నిర్వహించిన గణిత పరీక్షకు 7,728 మంది విద్యార్థులుహాజరుకావాల్సిఉండగా 7,716 మంది హాజరయ్యారని డీఈవో మాధవి తెలిపారు. మూడు ఫ్లయింగ్‌స్క్వాడ్‌ బృందాలు 15 పరీక్ష కేంద్రాలు, డీఈవో ఐదు పరీక్ష కేంద్రాలు పర్యవేక్షించారు. పరీక్షల విభాగం అసిస్టెంట్‌ కమిషనర్‌ఆయాపరీక్ష కేంద్రాలను సందర్శించారు.

తాగునీటి సమస్య రాకుండా చూడాలి



ట్యాంకు పరిశీలిస్తున్న ఎస్‌ఈ శ్రీనివాస్‌రావు

సుల్తానాబాద్‌(పెద్దపల్లి): పట్టణ ప్రజలకు తాగునీటి సమస్య రాకుండా చూడాలని వరంగల్‌ జోన్‌ హెచ్‌వో ఎస్‌ఈ శ్రీనివాస్‌రావు, ఈఈ పీహెచ్‌ సంపత్‌రావు అన్నారు. శనివారం మున్సిపల్‌ పరిధిలో కమిషనర్‌ వేణుమాధవ్‌, మిషన్‌ భగీరథ ఏఈ సంపత్‌, ఏఈ సతీశ్‌తో కలిసి మంచినీటి ట్యాంకులు పరిశీలించారు. పైప్‌లైన్‌ లీకేజీలు అరికట్టాలని, నీటిని వృథా చేయొద్దన్నారు. మంచినీటి ట్యాంకులను బ్లీచింగ్‌ పౌడర్‌తో నిత్యం శుభ్రం చేయాలని తెలిపారు. అనంతరం కార్యాలయంలో స్పెషల్‌ ఆఫీసర్‌ భాస్కరాచారితో కలిసి సమీక్షించారు.

ఎన్టీపీసీలో కాగడాల ప్రదర్శన



కాగాడాల ప్రదర్శనలో నాయకులు

జ్యోతినగర్‌(రామగుండం): షాహిద్‌ భగత్‌సింగ్‌, రాజగురు, సుఖ్‌దేవ్‌ వర్ధంతి సందర్భంగా ఎన్టీపీసీలో సీపీఐ(ఎంఎల్‌)న్యూడెమోక్రసీ అనుబంధ పీవైఎల్‌ నాయకులు చిలుక శంకర్‌. బుచ్చన్నల ఆధ్వర్యంలో శనివారం కాగడాల ప్రదర్శన నిర్వహించారు. దేశం కోసం అనేక పోరాటాలు చేస్తూ చివరికి చిరునవ్వుతో ఉరికంబానికి ఎక్కిన యువ విప్లవ కిశోరాలు యువతకు ఆదర్శమని వారు అన్నారు. దేశాన్ని పట్టిపీడిస్తున్న మతతత్వ, అవినీతి రాజకీయాలకు వ్యతిరేకంగా దేశాన్ని కాపాడుకోవాలని కోరారు. మేడిపల్లి సెంటర్‌ వరకు కాగడాల ప్రదర్శన కొనసాగింది. ఈ కార్యక్రమంలో నాయకులు మహేందర్‌, నర్సయ్య, రవీందర్‌, రమేశ్‌, రాజయ్య, సతీశ్‌, రాజేశ్‌, మధు, సాదీక్‌ తదితరులు పాల్గొన్నారు.

పోలీసుల కవాతు



కవాతు చేస్తున్న పోలీసులు

మంథని: పార్లమెంట్‌ ఎన్నికల నేపథ్యంలో పోలీసులు పట్టణంలో శనివారం కవాతు నిర్వహించారు. గోదావరిఖని ఏసీపీ రమేశ్‌ ఆధ్వర్యంలో సీఆర్పీఎఫ్‌ బలగాలతోపాటు స్థానిక పోలీసులు పురవీధుల్లో కవాతు నిర్వహించారు. పార్లమెంట్‌ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా ప్రజలు సహకరించాలని ఏసీపీ రమేశ్‌ కోరారు. ప్రజల్లో ఆత్మవిశ్వాసం నింపేందుకు రామగుండం పోలీస్‌ కమిషనర్‌ ఆదేశాల మేరకు కవాతు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. చట్టవిరుద్ధమైన కార్యక్రమాల సమాచారం అందించాలని ప్రజలను కోరారు. సీఐ వెంకటేశ్వర్లుతోపాటు డివిజన్‌లోని ఎస్సైలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

యువతపైనే దేశ భవిష్యత్‌

- జిల్లా ప్రధాన న్యాయమూర్తి హేమంత్‌కుమార్‌



మాట్లాడుతున్న జిల్లా ప్రధానన్యాయమూర్తి హేమంత్‌కుమార్‌, ప్రిన్సిపాల్‌ లక్ష్మీనారాయణ

పెద్దపల్లిరూరల్‌: 'యువత భుజస్కంధాలపైనే దేశ భవిష్యత్తు ఆధారపడి ఉంది.. యువత మత్తు మందుకు బానిసలుగా మారి తమశక్తిని నీరుగార్చుకోవద్దు' అని జిల్లా ప్రధాన న్యాయమూర్తి హేమంత్‌కుమార్‌ సూచించారు. స్థానిక సఖి కేంద్రంలో శనివారం సీనియర్‌ సివిల్‌ జడ్జి అర్జున్‌తో కలిసి న్యాయ విజ్ఞాన సదస్సులో పాల్గొని మాట్లాడారు. సోషల్‌ మీడియాలో అపరిచితులతో స్నేహం చేసి మోసపోతున్న వారిసంఖ్య పెరుగుతున్నా యువత అదేదారిలో పయనిస్తుస్తోందన్నారు. అలా కాకుండా ప్రతీ విద్యార్థి ఉన్నత లక్ష్యాన్ని ఎంచుకుని దాన్ని సాధించాలని సూచించారు. తల్లిదండ్రులకు సమాజంలో కీర్తిప్రతిష్ఠలను పెంచేస్థాయికి ఎదగాలన్నారు. మహిళలు ఇబ్బందులు పడుతుంటే సఖి కేంద్రాన్ని ఆశ్రయించాలని, తద్వారా వారి బాధతల నుంచి విముక్తి కలిగేదాకా అండగా ఉంటారని అన్నారు. అలాగే యువ విద్యార్థుల్లో పారా లీగల్‌ వలంటీర్లుగా పనిచేయాలని ఆసక్తి ఉంటే వారు జిల్లా న్యాయసేవ కార్యాలయానికి వచ్చి పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు. వారికి శిక్షణ ఇచ్చి గుర్తింపు కార్డులు అందిస్తామని తెలిపారు. శ్రీనివాస్‌, పంగ శంకర్‌, సంకీర్తన, ప్రభుత్వ డిగ్రీకాలేజీ ప్రిన్సిపాల్‌ లక్ష్మీనారాయణ, జిల్లా సంక్షేమశాఖ అధి కారి రవుఫ్‌ఖాన్‌, స్వప్న, సుమతి, కవిత, ఎస్సై మల్లేశ్‌, న్యాయవాదులు హన్మాన్‌సింగ్‌, నరేశ్‌ పాల్గొన్నారు.

కార్మికులను కలిసిన కొప్పుల



ఓటువేయాలని కార్మికులను అభ్యర్థిస్తున్న కొప్పుల ఈశ్వర్‌, మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్‌

గోదావరిఖని: పార్లమెంట్‌ ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌ పార్టీ అభ్యర్థిగా పోటీలో ఉంటున్న తనను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఆ పార్టీ పెద్దపల్లి ఎంపీ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్‌ కోరారు. శనివారం జీడీకే –11గనిపై కార్మికులను కలిసి ఓటు వేయాలని అభ్యర్థించారు. ఆయన వెంట మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్‌ తదితర నాయకులు ఉన్నారు.

కార్మికులకు అండగా ఉంటాం

- టీబీజీకేఎస్‌ స్టీరింగ్‌ కమిటీ చైర్మన్‌ మిర్యాల రాజిరెడ్డి



మాట్లాడుతున్న మిర్యాల రాజిరెడ్డి

గోదావరిఖని: కార్మికుల హక్కుల సాధన కోసం తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం(టీబీజీకేఎస్‌) పోరాడుతోందని ఆయూనియన్‌ స్టీరింగ్‌ కమిటీ చైర్మన్‌ మిర్యాల రాజిరెడ్డి అన్నారు. శనివారం గోదావరిఖనిలోని ఓ ప్రైవేట్‌ ఫంక్షన్‌ హాల్‌లో నూనె కొమురయ్య అధ్యక్షతన జరిగిన తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం రాష్ట్ర వర్కింగ్‌ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్మిక హక్కుల సాధనకు అవిశ్రాంతంగా పోరాడుతున్న టీబీజీకేఎస్‌ను అంతం చేయడం ఎవరితరం కాదని వెల్లడించారు. తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో అత్యంత కీలక భూమిక పోషించిందని అన్నారు. నాలుగు కోట్ల తెలంగాణ ప్రజలకు మార్గదర్శకంగా నిలిచిందన్నారు. రాజకీయాలకు అతీతంగా కార్మిక సంఘాన్ని పునర్నిర్మాణం చేస్తున్నామని పేర్కొన్నారు. గని స్థాయి నుంచి కేంద్ర కమిటీ వరకు పటిష్టమైన నాయకత్వాన్ని నియమించుకొని ముందుకు సాగుతామన్నారు. సింగరేణిలో గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాలు కార్మికుల సంక్షేమం కోసం పనిచేయడం లేదని విమర్శించారు. కార్మిక హక్కుల సాధనకు, సంక్షేమ చర్యల అమలుకు అవిశ్రాంత పోరాటం చేస్తామన్నారు. 11 ఏళ్ల కాలంలో 75 హక్కులను సాధించి పెట్టామన్నారు. సమావేశంలో 11 డివిజన్లకు చెందిన యూనియన్‌ నాయకులు మల్రాజ్‌ శ్రీనివాస్‌రావు, మేడిపల్లి సంపత్‌, బడికల సంపత్‌కుమార్‌, లక్ష్మణ్‌, రాజశేఖర్‌, మంగీలాల్‌, వడ్డేపల్లి శంకర్‌, జాహీద్‌పాషా, పర్లపల్లి రవి, మాదాసి రామమూర్తి, ఐలి శ్రీనివాస్‌, సంపత్‌రెడ్డి, నాగేశ్వరరావు, బడితల సమ్మయ్య, కాపు కృష్ణ, కిరణ్‌కుమార్‌, తుమ్మ శ్రీనివాస్‌, హరిప్రసాద్‌, మురళి తదితరులు పాల్గొన్నారు. తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం కేంద్ర అధ్యక్షుడు బి.వెంకట్రావు, ప్రధాన కార్యదర్శి మిర్యాల రాజిరెడ్డి, వర్కింగ్‌ ప్రెసిడెంట్‌ మల్లయ్య సంఘానికి చేసిన రాజీనామాను వర్కింగ్‌ కమిటీ ఏకగ్రీవంగా ఆమోదించింది.

టీబీ ముక్త్‌భారత్‌ లక్ష్యం

- అడిషనల్‌ కలెక్టర్‌ అరుణశ్రీ

పెద్దపల్లిరూరల్‌: క్షయను సంపూర్ణంగా తరిమేసి 2025 నాటికల్లా టీబీ ముక్త్‌ భారత్‌గా ప్రకటించేలా కేంద్రప్రభుత్వం కార్యాచరణ చేపట్టిందని, అందులో అందరూ భాగస్వాములు కావాలని అడిషనల్‌ కలెక్టర్‌ అరుణశ్రీ కోరారు. కలెక్టరేట్‌ ఆవరణలో శనివారం జిల్లాలోని పలు ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రా(పీహెచ్‌సీ)ల వైద్యసిబ్బందితో అదనపు కలెక్టర్‌ సమావేశమై పలు సూచనలు చేశారు. ఏటా మార్చి 24న ప్రపంచ క్షయ దినోత్సవం జరుపుకుంటున్నామన్నారు. టీబీ ముక్త్‌ భారత్‌ను సాధించేందుకు క్షేత్రస్థాయిలో ఏఎన్‌ఎంలు, ఆశ కార్యకర్తలదే ప్రధాన భూమిక అని అన్నారు. అంగన్‌వాడీ, స్వశక్తి మహిళల సహకారంతో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని అరుణశ్రీ సూచించారు. క్షయ లక్షణాలు కనిపిస్తే సమీపంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో వెంటనే పరీక్షలు చేయించుకోవాలని డీఎంహెచ్‌వో ప్రమోద్‌కుమార్‌ కోరారు. క్షయ నియంత్రణకు స్వచ్ఛందంగా సహకారం అందిస్తున్న పలువురికి ప్రశంసపత్రాలు అందించారు. టీబీ ప్రోగ్రాం అధికారి సుధాకర్‌రెడ్డి, అధికారులు డోరకమ్మ, వెంకటేశ్వర్లు, ప్రతాపరెడ్డి, మధుసూదన్‌, ప్రభాకర్‌, రాజేందర్‌ పాల్గొన్నారు.

రైతులకు పరిహారం చెల్లించండి

- జిల్లా పరిషత్‌ చైర్మన్‌ పుట్ట మధు



పంట పరిశీలిస్తున్న జెడ్పీ చైర్మన్‌ పుట్ట మధు

మంథని: వడగళ్లవానకు పంటలు నష్టపోయిన రైతులకు పరిహారం ప్రకటించిన విధంగా నీళ్ల అందక ఎండిపోయిన పంటలకు సైతం పరిహారం చెల్లించి న్యాయం చేయాలని జిల్లా పరిషత్‌ చైర్మన్‌ పుట్ట మధు డిమాండ్‌ చేశారు. సూరయ్యపల్లి శివారులో నీళ్ల అందక ఎండిపోయిన పంటలను ఆయన శనివారం పరిశీలించారు. బీఆర్‌ఎస్‌ హయాంలో ప్రాజెక్టుల్లోని నీళ్ల తరలించుకుపోతున్నారని అప్పుడు బద్నాం చేసిన కాంగ్రెస్‌ నాయకులు ఇప్పుడు ప్రభుత్వంలో ఉండి ఎందుకు నీళ్లు ఇవ్వడం లేదని ఆయన ప్రశ్నించారు. ఎల్లంపల్లి, ఎస్సారెస్పీల్లో నీళ్లు ఉన్నా సాగునీరు అందించకుండా పంటలు ఎండబెడుతున్న ఘనత కాంగ్రెస్‌ పార్టీ ప్రభుత్వానికి దక్కుతుందని ఎద్దేవా చేశారు. నాయకులు చెరుకుతోట ఓదెలు, ఆకుల రాజబాపు, ప్రకాశ్‌రెడ్డి ఉన్నారు.



ముచ్చటైన మూడు ముంగీసలు

ఒకటికాదు.. రెండు కాదు.. ఏకంగా మూడు ముంగీసలు 'సాక్షి' కెమెరాకు చిక్కాయి. ముళ్ల పొదల్లోంచి బయటకు వచ్చిన ముంగీసలు.. క్షణం పాటు ఆగి.. అటూఇటూ చూసి.. ఆ తర్వాత మెరుపు వేగంతో మళ్లీ ముళ్లపొదల్లోకి పరుగులు తీసాయి. మంథని శివారులో శనివారం ఈ దృశ్యం కనిపించింది. – సాక్షి ఫొటోగ్రాఫర్‌, పెద్దపల్లి

సదస్సుకు కార్మిక నేతల హాజరు



సదస్సులో పాల్గొన్న నాయకులు

గోదావరిఖని: బొగ్గు పరిశ్రమలో కార్మికుల సమస్యలు–భవిష్యత్‌లో పరిశ్రమ మనుగడపై శనివారం హైదరాబాద్‌ ఐఐటీ, గచ్చిబౌలిలో ఢిల్లీ ఐఐటీ విద్యార్థులతో జరిగిన సదస్సులో కార్మిక సంఘాల నాయకులు పాల్గొన్నారు. పలు అంశాలపై ఈ సదస్సుల్లో సుదీర్ఘంగా చర్చించారు. ఏఐటీయూసీ జాతీయ ప్రధాన కార్యదర్శి అమర్‌జిత్‌కౌర్‌, రాష్ట్ర అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య, ఝార్ఖండ్‌లోని యూనియన్‌ నేత లఖన్‌లాల్‌మహాతో, నాగపూర్‌లోని యూనియన్‌ నేత ఎస్‌.జోసఫ్‌, రిటైర్డ్‌ ఎంప్లాయీస్‌ ఫెడరేషన్‌ నాయకుడు ఆళవందార్‌ వేణుమాధవ్‌, సీఐటీయూ అధ్యక్షుడు రాజారెడ్డి, హెచ్‌ఎంఎస్‌ అధ్యక్షుడు రియాజ్‌అహ్మద్‌ పాల్గొన్నారు.

నత్తనడకన ఆస్తిపన్ను వసూలు

- ముంచుకొస్తున్న గడువు
- డిమాండ్‌ రూ.27.14కోట్లు
- వసూలు చేసింది 13.01కోట్లు
- రామగుండంలో 42.55 శాతమే..
- సుల్తానాబాద్‌లో 46.90 శాతం నమోదు
- వీడని బల్దియా అధికారుల నిర్లక్ష్యం



స్పెషల్‌ డ్రైవ్‌లో నగరపాలక కమిషనర్‌ శ్రీకాంత్‌



బకాయిదారు నల్లా కనెక్షన్‌ తొలగిస్తున్న సిబ్బంది

కోల్‌సిటీ(రామగుండం): జిల్లాలోని రామగుండం నగర పాలక సంస్థతోపాటు పెద్దపల్లి, సుల్తానాబాద్‌, మంథని మున్సిపలిటీల్లో ఈ ఆర్థిక సంవత్సరంలో ఆస్తిపన్ను వసూలు నత్తనడకన సాగుతోంది. ఉద్యోగులు, కార్మికులు, సిబ్బంది వేతనాల చెల్లింపు, ఇతర అభివృద్ధి పనులు, నిర్వహణ కోసం ఆస్తిపన్ను బల్దియాలకు ప్రధాన ఆదాయ వనరు. మరో వారం రోజుల్లో ఆర్థిక సంవత్సరం గడువు ముగియనుంది. అధికారులు ప్రణాళిక బద్ధంగా ఆస్తిపన్ను వసూలు చేస్తున్నా.. లక్ష్యం చేరుకోవడం లేదు. అధికారులు అనుసరిస్తున్న ఉదాసీనతే ఇందుకు కారణమనే ఆరోపణలు వస్తున్నాయి.

డిమాండ్‌ రూ.27.14కోట్లు..

- రామగుండం నగరపాలక సంస్థతోపాటు పెద్దపల్లి, సుల్తానాబాద్‌, మంథని పురపాలక సంఘాల్లో ఆస్తిపన్ను డిమాండ్‌ రూ.27.14కోట్ల వరకు ఉంది. ఈనెల 20వ తేదీ వరకు రూ.13.01కోట్ల వరకే వసూలయ్యింది. ఇది 47.96శాతంగా నమోదయ్యింది.

మరో వారం రోజులే గడువు...

- ఈ ఆర్థిక సంవత్సరం గడువు కేవలం వారం రోజులే ఉంది. కానీ, ఆయా మున్సిపాలిటీల్లో ఆశించిన మేరకు ఆస్తిపన్ను వసూలు కావడం లేదు. ప్రభుత్వం ఆస్తిపన్నుపై 90శాతం వడ్డీమాఫీ ప్రకటించినా.. మొండి బకాయిదారులు ముందుకు రావడం లేదు. ఈనెల 31వ తేదీతో ఈ గడువు ముగియనుంది. ఆస్తిపన్ను పురోగతిపై జిల్లా ఉన్నాధికారులతోపాటు సీడీఎంఏ నుంచి ప్రతిరోజూ వివరాలు సేకరిస్తున్నారు. రెండు రోజులకోసారి మున్సిపల్‌ కమిషనర్లు ఆస్తిపన్ను వసూళ్ల పురోగతిపై సమీక్షిస్తున్నారు. స్వయంగా మున్సిపల్‌ కమిషనర్లు సైతం ఆస్తిపన్ను వసూళ్ల స్పెషల్‌ డ్రైవ్‌లో పాల్గొంటున్నారు.

బల్దియా	అసెస్మెంట్‌	వసూలు (రూ.కోట్లల్లో)	డిమాండ్‌ (రూ.కోట్లల్లో)	శాతం
రామగుండం	50,841	15.63	6.65	42.55
పెద్దపల్లి	11,656	6.47	3.66	56.58
సుల్తానాబాద్‌	5,387	2.95	1.38	46.90
మంథని	4,999	2.09	1.32	63.21

ముందుకు రావాలి



రామగుండంలో ఆస్తిపన్ను వసూళ్లకు ప్రత్యేక బృందంతో స్పెషల్‌ డ్రైవ్‌ నిర్వహిస్తున్నాం. వసూళ్లపై ప్రతిరోజూ సమీక్షిస్తున్నాం. మొండిబకాయిదారులకు రోజూ ఫోన్లు చేస్తున్నాం. నేరుగా కలిసి ఆస్తిపన్నుతోపాటు ఇతర బిల్లులు చెల్లించేలా అవగాహన కల్పిస్తున్నాం. వడ్డీపై 90శాతం రాయితీ అవకాశం ఇంకా వారం రోజులే ఉంది. ఈ వకాశాన్ని బకాయిదారులు సద్వినియోగం చేసుకోవాలి. బిల్‌ కలెక్టర్లకు టార్గెట్లు విధించాం. నల్లా బిల్లులు కట్టని వారి ఇంటి కనెక్షన్‌ తొలగిస్తున్నాం. ఆస్తిపన్ను చెల్లించనివారి ఆస్తి జప్తు చేస్తాం. మైకుల ద్వారా విస్తత ప్రచారం చేస్తున్నాం. ప్రజలు సకాలంలో ఆస్తిపన్ను చెల్లించి నగరాభివృద్ధికి సహకరించాలి. – శ్రీకాంత్‌, నగరపాలక కమిషనర్‌, రామగుండం

క్లుప్తంగా

నిషేధిత ప్లాస్టిక్ విక్రయదారులకు జరిమానా



జరిమానా విధిస్తున్న అధికారులు

ఫెర్టిలైజర్‌సిటీ(రామగుండం): రామగుండం కార్పొరేషన్ పరిధి 38,39వ డివిజన్లలో శనివారం శానిటరీ ఇన్‌స్పెక్టర్ రంగు నాగభూషణం ఆధ్వర్యంలో పలు షాపుల్లో తనిఖీలు నిర్వహించారు. నిషేధిత ప్లాస్టిక్ కవర్లు వినియోగిస్తున్న వ్యాపారులకు జరిమానా విధించారు. కార్యక్రమంలో శానిటరీ సూపర్‌వైజర్ ఆదేపు శ్రీనివాస్ పాల్గొన్నారు.

నదిలో దూకేందుకు యత్నం.. కాపాడిన పోలీసులు

యైటింక్లయిన్‌కాలనీ(రామగుండం): గోదావరి బ్రిడ్జిపై నుంచి నదిలో దూకేందుకు యత్నించిన ఇద్దరిని టూటౌన్ పోలీసులు కాపాడారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మంచిర్యాల జిల్లా నస్పూర్‌కు చెందిన సింగరేణి మాజీ కార్మికుడు కొంతకాలంగా తీవ్ర అనారోగ్యంతో బాధపడుతూ తనువు చాలించాలని గోదావరి బ్రిడ్జి వద్దకు చేరుకున్నాడు. బ్రిడ్జి పైనుంచి నదిలో దూకి ఆత్మహత్య చేసుకునేందుకు ప్రయత్నించగా లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో అక్కడ ఏర్పాటు చేసిన చెక్‌పోస్ట్ వద్ద విధులు నిర్వహిస్తున్న టూటౌన్ ఎస్‌ఎస్‌టీ టీం హెడ్ కానిస్టేబుల్ ఖలీల్‌ఖాన్, జంపయ్య, కానిస్టేబుల్ పూర్ణచందర్ అడ్డుకున్నారు. కౌన్సెలింగ్ నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. అలాగే గోదావరిఖని తిలక్‌నగర్‌కు చెందిన ఓ యువకుడు సైతం నదిలో దూకేందకు ప్రయత్నించగా అడ్డుకొని బంధువులకు అప్పగించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం

మంథని: మంథని–కాటారం ప్రధాన రహదారి నాగేపల్లి శివారులో శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాటారం మండలం వీరాపూర్ గ్రామానికి చెందిన గద్దల సమ్మయ్య (34) అక్కడికక్కడే మృతిచెందాడు. అతడి సోదరుడు సతీశ్‌కు స్వల్ప గాయాలైనట్లు ఎస్‌ఐ వెంకటకృష్ణ తెలిపారు. మంథని మండలం గోపాల్‌పూర్‌లో బంధువుల ఇంట్లో ఓ కార్యక్రమంలో పాల్గొనేందుకు ద్విచక్ర వాహనంపై వచ్చారు. తిరిగి స్వగ్రామానికి వెళ్తుండగా నాగేపల్లి శివారులో రహదారిపై ఉన్న కల్వర్టును ఢీకొనడంతో సమ్మయ్య మృతిచెందాడు.

ఉపాధి కూలీలపై తేనెటీగల దాడి

- 8 మందికి గాయాలు, ఒకరి పరిస్థితి విషమం

జూలపల్లి(పెద్దపల్లి): ఉపాధిహామీ కూలీలపై తేనెటీగలు దాడి చేశాయి. ఈఘటనలో 8 మందికి గాయాలు కాగా ఒకరి పరిస్థితి విషమంగా మారింది. వేసవి దృష్ట్యా శనివారం ఉదయమే స్థానిక–డి 83 ఉప కాలువ 9ఆర్‌పై కొందరు కూలీలు తుమ్మచెట్లు నరుకుతున్నారు. ఈక్రమంలో అక్కడే ఉన్న తేనెటీగలు లేచి వారిపై దాడికి దిగారు. దీంతో కూలీలు తలోదిక్కు పరుగులు తీశారు. ఇందులోని 8మందిని తేనెటీగలు వెంటాడి దాడిచేశాయి. గాయపడిన వారిని స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తీసుకెళ్లారు. వైద్యాధికారి సంపత్‌రెడ్డి వారికి ప్రథమ చికిత్స అందించారు. ఏడుగురిని ఇంటికి పంపించారు. తీవ్రంగా గాయపడ్డ మెండె రాజవ్వను ఏపీవో సదానందం ఆధ్వర్యంలో 108 వాహనం ద్వారా కరీంనగర్‌లోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఆమె పరిస్థితి విషమంగా ఉండడంతో వరంగల్, లేదా హైదరాబాద్‌లోని ఆస్పత్రులకు తీసుకెళ్లాలని సూచించారని ఏపీవో సదానందం తెలిపారు.

రంగుల పండుగ వచ్చేసింది..



- జోరుగా చిన్నారుల జాజిరి
- ఆటపాటలతో సంబురాలు
- నేడు కాముని దహనం
- రేపు హోలీ పండుగ

విద్యానగర్(కరీంనగర్)/జ్యోతినగర్ (రామగుండం): హైందవ పండుగల్లో పండుగకో ప్రత్యేకత ఉంది. ఒక్కో పండుగను ఒక్కో తీరుకగా జరుపుకుంటాం. హోలీ పండుగను రంగులు చల్లుకుని ఆనందంగా ఆడుకుంటాం.. పెద్ద ఎత్తున సంబురాలు చేసుకుంటాం. హోలీ వయసుతో సంబంధం లేకుండా జరుపుకునే ఏకైక వేడుక. ప్రతీ పండుగకు కొత్త బట్టలు కొనుక్కుని ధరిస్తాం. కానీ, రంగుల పండగకు సాధారణ దుస్తులు ధరించి రంగులు చల్లుకోవడం ఆనవాయితీ. ఈనెల 25వ తేదీన జిల్లాలో హోలీ వేడుక జరుపుకునేందుకు జిల్లావసులు సర్వం సిద్ధం చేసుకుంటున్నారు.

జాజిరి.. జాజిరి.. జాజిరే ఓయమ్మ..
జాజిరాటలాడుదామే రాధమ్మా
కట్టపొంటి కట్టపొంటి కర్రావు పాయే..
పందిని సంపింది ఎవడ్రా.. రావణాసుడి తమ్ముడ్రా..
కోతి పుట్టుడెందుకు.. కొమ్మలెక్కతందుకు..
ఈరన్నా బల్లికోడె.. ఈరగంధం పూసుకుని..
అని కర్రలు పట్టుకుని, లయబద్ధంగా ఆడుతూ..
ఊళ్లలో ఇంటింటా తిరుగుతున్నారు చిన్నారులు.



హోలీ పండుగ..

హోలీ పండుగకు ముందు పదిహేను రోజుల నుంచి అన్నివర్గాలు, పిల్లలు గ్రామాలు, పట్టణాలు, నగరాల్లో ఉత్సవాలు జరుకుంటారు. ఇందులో తొలిఘట్టంల్లో జాజిరి ఆటలు ఆడుకోవడం ప్రత్యేకం. ఇంటింటా తిరుగుతూ వారు ఇచ్చే డబ్బులు, ఇతర వస్తుసామగ్రి పోగు చేసుకుంటారు. చివరిరోజు జాజిరి ఆడిన వారందరూ ఆ డబ్బు పంచుకుని, రంగులు కొనుగోలు చేసుకుని పరస్పరం చల్లుకుంటూ ఆనందంలో మునిగి తేలుతారు. తెలంగాణ ప్రాంతంలో హోలీ పండుగను కాముని పున్నమి అని పిలుస్తారు. కామదహనానికి ముందు జాజిరి ఆటలో ఆడిన కర్రలను ఒకచోట వేసి దహనం చేస్తూ పూజిస్తారు. తెల్లవారి హోలీ పండుగ జరుపుకుంటారు.

రూటు మారిన జాజిరి..

పట్టణాల్లో చాలా మందికి జాజి ఆట అంటే తెలియని పరిస్థితులు నెలకొన్నాయి. కానీ, గ్రామాల్లో నేటికి కూడా జాజిరి ఆడుతున్నారు. కర్రలను చేతబట్టుకుని లయబద్ధంగా కొడుతూ పాటలు పాడుతూ ఇల్లిల్లూ తిరుగుతున్నారు. కొందరు కోలాటాలు వేస్తూ, నృత్యాలు చేస్తూ, మరికొందరు డప్పులు వాయించుకుంటూ జాజిరి ఆడుతున్నారు. ఏదిఏమైనా మన సంస్కృతి, సంప్రదాయాలను తెలుసుకుని వాటిని కొనసాగిస్తేనే మానవ మనుగడ కలకాలం హాయిగా ఉంటుందని సంప్రదాయవాదులు అభిప్రాయపడుతున్నారు.

పండుగ విశిష్టత..

వసంత రుతువు ప్రారంభం కావడంతో చెట్ల ఆకులు రాలి చిగురిస్తాయి. ఈ కాలంలో చెట్లు వివిధ రకాలపూలు పూస్తాయి. మోదుగుచెట్ల పూలు ఎర్రగా, అందంగా కనిపిస్తాయి. సహజ సిద్ధమైన రంగులు తయారు చేసుకుని ఒకరిపై ఒకరు చల్లుకుంటారు.



ఆనాటి ఆటలు లేవు



ఆనాడు మేం ఆడుకున్న ఆటలు.. పాడుకున్న పాటలు నేడు కానరావడం లేదు. హోలీ పండుగ వస్తుందంటే వారం రోజులు నుంచి రోజూ రాత్రి మా దోస్తులతో ఇంటింటికీ వెళ్లి పాటలు పాడుతూ కోలలతో ఆడుకునే వాళ్లం. జబ్బకు సంచి ఉంచుకుని జోలె పట్టుకుని ఆడుకునే వాళ్లం. నేడు అవి కనిపిండం లేదు. అంతా సెల్‌ఫోన్ మాయలో పడి సంప్రదాయ ఆటలు మార్చిపోతున్నారు.

–రాజలింగు



జాజిరి ఆడుతున్నం



హోలీ పండుగ ఉందని జాజిరి అడుకుంటున్నం. మా తాత ఇంటి వద్ద చాలా మంది పిల్లలు కర్రలతో ఆడుకుంటున్నరు. నేను కూడా కర్రలు తీసుకుని వారితో జాజిరి ఆడేందుకు వెళ్తున్నం. చాలా ఆనందంగా ఉంది.

– శ్రేయాంశ్, విద్యార్థి, మేడిపల్లి సెంటర్

ధూంధామే..



హోలీ రోజు మాకాలనీ రంగులు, తీన్మార్ డ్యాన్స్‌లతో ధూంధాంగా ఉంటుంది, చిన్నా, పెద్ద తేడా లేకుండా అందరం కలిసి కేకలు, కేరింతలతో రంగులు జల్లుకుంటూ ఆనందంగా రంగుల వేడుక జరుపుకుంటాం.

– సుచరిత, రాంనగర్, కరీంనగర్

అందరితో కలిసి ఆడుకుంటాం



నేను, మా వీధిలోని పిల్లలు, యువతులు, మహిళలతో కలిసి హోలీ ఆడుకుంటాం. వాళ్లందరు మా ఇంటికే వస్తారు. రంగులు, వాటర్ కేన్‌లతో రంగులు చల్లుకుంటాం. ఆటపాటలతో హోలీ జరుపుకుంటాం.

– వాసాల స్నేహ, వినాయక మార్కెట్, కరీంనగర్

నేడు కామదహనం



ఆదివారం కామదహనం, సోమవారం హోలీ పండుగా జరుపుకోవాలి. భౌతిక కామవాంఛలన్నీ తగులబెట్టి, ధర్మబద్ధంగా జీవితం గడపాలనే ఉద్దేశమే కామ దహనం పరమార్థం.

– నమిలకొండ రమణాచార్యులు, మయూరగిరి పీఠాధిపతి,

సహజసిద్ధ రంగులు వాడాలి



ముదురు రంగులను శరీరంపై ఎక్కువ సేపు ఉంచుకోకుండా పది నిమిషాల్లో శుభ్రం చేసుకోవాలి. ఎక్కువ సేపు ఉంటే ఎలర్జీ వచ్చే ప్రమాదం ఉంది. ద్రవ రూప రసాయనాలు వాడొద్దు. ఆయిల్, గ్రీజ్ లాంటి పదార్థాలు ఉపయోగించడం క్షేమం కాదు.

– వి.సుమన్‌చందర్‌రావు, చర్మవ్యాధుల నిపుణుడు

కృత్రిమ రసాయనాలతో ప్రమాదం



రంగులు ఏవైనా కళ్లల్లో పడకుండా జాగ్రత్త పడాలి. హానికర రసాయనాలతో కూడిన రంగులతో రెటినా దెబ్బతినే ప్రమాదం ఉంది. అల్సర్లు, పుండ్లు ఏర్పడి శాశ్వతంగా కంటిచూపు దెబ్బతినే అవకాశం ఉంది.

– వి.రఘు, నేత్ర వైద్య నిపుణుడు, కరీంనగర్

అవగాహనతో సైబర్ నేరాల నియంత్రణ

- గోదావరిఖని అదనపు జిల్లా జడ్జి శ్రీనివాసరావు

గోదావరిఖనిటౌన్: అవగాహనతో సైబర్ నేరాల నియంత్రణ సాధ్యమని గోదావరిఖని అదనపు జిల్లా న్యాయమూర్తి శ్రీనివాసరావు అన్నారు. శనివారం అదనపు జిల్లా న్యాయస్థానంలో మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో సైబర్ నేరాలపై నిర్వహించిన అవగాహన సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సైబర్ నేరస్తులతో నిత్యం అప్రమత్తంగా ఉండాలన్నారు. మొబైల్ ఫోన్లలో అనధికారిక లింక్‌లపై స్పందించరాదని సూచించారు. వ్యక్తిగత వివరాలు ఎవరికీ వెల్లడించరాదన్నారు. సైబర్ నేరాలు జరిగిన వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌లో లేదా 1930 టోల్ ఫ్రీ నెంనంబరుకు లేదా ఎన్‌సీఆర్‌పీ పోర్టల్‌లో ఫిర్యాదు చేయాలని సైబర్ క్రైమ్ సీఐ కృష్ణ మూర్తి సూచించారు. అనంతరం ఇటీవల జరిగిన జాతీయ లోక్ అదాలత్ అధిక కేసుల పరిష్కారానికి కృషి చేసిన కోర్టు డ్యూటీ ఆఫీసర్‌లను న్యాయమూర్తులు శాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో గోదావరిఖని సీనియర్ సివిల్ జడ్జి ఆర్.రాజ్‌కుమార్, మున్సిఫ్ మెజిస్ట్రేట్ వెంకటేశ్ దుర్వ, దుర్గం గణేశ్, గోదావరిఖని ఏసీపీ రమేశ్, వన్‌టౌన్, టూటౌన్, రామగుండం సీఐలు ఇంద్రసేనారెడ్డి, బి.రవీందర్, అజయ్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మేడ చక్రపాణి, లోక్ అదాలత్ సభ్యుడు శంకర్, న్యాయవాదులు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జడ్జి శ్రీనివాసరావు

పగలు రెక్కీ.. రాత్రి చోరీ

- అంతర్‌రాష్ట్ర రాగితీగ చోరీ ముఠా అరెస్టు
- వివరాలు వెల్లడించిన గోదావరిఖని ఏసీపీ రమేశ్

జ్యోతినగర్(రామగుండం): పగలు రెక్కీ నిర్వహించి రాత్రివేళ కాపర్‌వైర్ చోరీ చేసే అంతర్రాష్ట్ర దొంగల ముఠాను పెద్దపల్లి జిల్లా రామగుండం కార్పొరేషన్‌లోని ఎన్టీపీసీ పోలీసులు అరెస్టు చేశారు. శనివారం రాత్రి ఎన్టీపీసీ పోలీస్‌స్టేషన్‌లో గోదావరిఖని ఏసీపీ రమేశ్, రామగుండం సీఐ అజయ్‌బాబు, ఎన్టీపీసీ ఎస్సై ఉదయ్‌కిరణ్ కేసు వివరాలు వెల్లడించారు. రామగుండం పోలీసు కమిషనరేట్ పరిధిలో వరుసగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు పగులగొట్టి కాపర్‌వైర్ చోరీ చేస్తున్నారు. ఈవిషయంపై ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఎన్టీపీసీ ఎస్సై ఉదయ్‌కిరణ్, గోదావరిఖని డివిజన్ క్రైమ్ టీంతో కలిసి దర్యాప్తు ప్రారంభించారు. ఈక్రమంలో శనివారం ఉదయం గౌతమినగర్ సెంటర్ వద్ద వాహనాలు తనిఖీలు చేశారు. దీంతో గుర్రాల చంటి, గుర్రాల సుధాకర్, కోట వంశీ సుమారు వంద కిలోల రాగి తీగ ట్రాలీలో తరలిస్తున్నారు. వారిని గుర్రాల మనోజ్, గుర్రాల రాజేశ్ మోటార్ సైకిళ్లపై అనుసరిస్తున్నారు. ఎన్టీపీసీ ప్రాంతానికి వారు రాగా పోలీసులు ఆపి ప్రశ్నించారు. దీంతో కాపర్ వైర్ చోరీ చేసి తీసుకెళ్తున్నామని నిందితులు అంగీకరించారు. చోరీచేసిన కాపర్‌వైర్‌ను గోదావరిఖనిలోని విజయ్‌సింగ్, ఎల్లేశ్(రిసివేర్స్)తోపాటు, గ్రామాల్లోకి వచ్చే పాత ఇనుప సామగ్రి వ్యాపారులకు విక్రయించామని తెలిపారు. ఇలా వచ్చిన డబ్బుతో జల్సాలు చేసుకుంటున్నారు. ఈ కేసులో గోదావరిఖని రాజీవ్‌నగర్‌కు చెందిన గుర్రాల చంటి, మార్కండేయ కాలనికి చెందిన గుర్రాల మనోజ్, సంజయ్‌గాంధీనగర్‌కు చెందిన గుర్రాల సుధాకర్, రాజీవ్‌నగర్‌కు చెందిన గుర్రాల రాజేశ్, కోట వంశీను పోలీసులు అరెస్ట్ చేశారు. కోట రాజశేఖర్, కోట సంతోష్, విజయ్‌సింగ్ (రిసివేర్), ఎల్లేశ్ (రిసివేర్) పరారీలో ఉన్నారు. వీరంతా పలు ద్విచక్రవాహనాలపై సంచరిస్తూ ఆయా ప్రాంతాల్లో రెక్కీ చేస్తారు. చోరీకి వీలుగా ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు గుర్తిస్తారు. రాత్రి ట్రాలీఆటోలో వెళ్లి ట్రాన్స్‌ఫార్మర్ ధ్వంసం చేసి అందులోని రాగితీగ అపహరిస్తున్నారు. కాగా, నిందితులు 18 కేసుల్లో కొల్లగొట్టిన విద్యుత్ 22 విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు, అందులోని 100 కేజీల కాపర్‌వైర్, ఆటోట్రాలీ, రెండు పల్సర్ బైక్‌లు పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నిందితులను పట్టుకోవడంలో చాకచక్యంగా వ్యవహరించిన రామగుండం సీఐ అజయ్‌బాబు, ఎన్టీపీసీ ఎస్సై ఉదయ్‌కిరణ్, పోలీసు సిబ్బంది మల్లికార్జున్, అంజయ్య, దుబాసి రమేశ్, రమేశ్‌ను ఏసీపీ రమేశ్ అభినందించి రివార్డులు అందించారు.



వివరాలు వెల్లడిస్తున్న గోదావరిఖని ఏసీపీ రమేశ్, సీఐ అజయ్‌బాబు, ఎస్సై ఉదయ్‌కిరణ్

కోతుల దాడిలో మహిళకు గాయాలు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): కోతుల దాడిలో ఓ మహిళకు తీవ్ర గాయాలయ్యాయి. ఎల్లారెడ్డిపేట మండలం సింగారం గ్రామంలో వాసరి భాగ్య శనివారం రోడ్డు వెంట నడుస్తూ వెళ్తోంది. కోతులు ఒక్కసారిగా ఆమెపైకి రావడంతో పరుగులు తీసింది. అయినా వెంబడించి, దాడి చేయడంతో తీవ్రంగా గాయపడింది. బాధితురాలిని స్థానికులు ఆస్పత్రికి తరలించారు. గ్రామంలో కోతుల బెడద ఎక్కువగా ఉందని, అధికారులు చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరారు.

ధర్మపురిలో కొనసాగుతున్న బ్రహ్మోత్సవాలు

ధర్మపురి: స్థానిక శ్రీలక్ష్మీనృసింహస్వామి దేవస్థానంలో స్వామివారి బ్రహ్మోత్సవాలను వైభవంగా నిర్వహిస్తున్నారు. నాలుగో రోజు శనివారం ప్రధాన ఆలయంతోపాటు అనుబంధ ఆలయాల్లో వేలాది మంది భక్తులు స్వామివార్లను దర్శించుకున్నారు. నృసింహునికి కోడె మొక్కు, కొబ్బరి బెల్లాలు, తలనీలాలు సమర్పించారు. అంతకుముందు పవిత్ర గోదావరిలో పుణ్యస్నానాలు ఆచరించారు. ఆదివారం కోనేరులో స్వామివారి తెప్పోత్సవ, డోలోత్సవ కార్యక్రమం వీక్షించాలనుకున్న పలువురు ఒక రోజు ముందుగానే ధర్మపురికి చేరుకున్నారు. వారికి పాత టీటీడీ కల్యాణ మండపంలో ఉచితంగా అన్నదానం చేపట్టారు. తాగునీటి ఇబ్బందులు కలగకుండా మున్సిపల్ శాఖ, దేవాలయం తరపున 20 చోట్ల చలివేంద్రాలు, నీడ వసతి ఏర్పాటు చేశారు.



నృసింహుని దర్శనానికి క్యూలైన్‌లో భక్తులు



తలనీలాల సమర్పణ..

ఆరోహణ–2024 ఓవరాల్ చాంపియన్ 'అల్ఫోర్స్'

కొత్తపల్లి(కరీంనగర్): కరీంనగర్‌లోని శాతవాహన విశ్వవిద్యాలయం నిర్వహించిన మేనేజ్‌మీట్ ఆరోహణ–2024 ఓవరాల్ చాంపియన్‌షిప్‌ను సీతారాంపూర్‌లోని అల్ఫోర్స్ మహిళా డిగ్రీ, పీజీ కళాశాల సొంతం చేసుకున్నట్లు కళాశాల కరస్పాండెంట్ వి.రవీందర్‌రెడ్డి తెలిపారు. శాతవాహన వర్సిటీ నిర్వహించిన ఆరోహణ–2024 పోటీల 7 అంశాల్లో బిజినెస్ క్విజ్, యాడ్‌మేకింగ్, రోల్‌ప్లే తదితర అంశాల్లో ప్రతిభ కనబరిచి చాంపియన్‌షిప్‌ను గెలుచుకున్నట్లు పేర్కొన్నారు. అలాగే వికల్ప–2024లో సైతం ఓవరాల్ చాంప్‌ను గెలుపొందడం జరిగిందన్నారు. చాంపియన్‌షిప్‌ను కైవసం చేసుకున్న విద్యార్థులను శనివారం అభినందించారు. ఈ కార్యక్రజుమంలో ప్రిన్సిపాల్ గోళి శ్రీనివాస్, వైస్ ప్రిన్సిపాల్స్ డా.విజయలక్ష్మి, జి.చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



చాంపియన్‌షిప్ సాధించిన అల్ఫోర్స్ మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థినులు

కార్పొరేట్ సర్వే జీఎంకు సన్మానం



సర్వే జీఎం జైనుల్ ఆబిదీన్‌ను సన్మానిస్తున్న జీఎం చింతల శ్రీనివాస్ తదితరులు

గోదావరిఖని(రామగుండం): రామగుండం రీజియన్ పర్యటనకు వచ్చిన కార్పొరేట్ సర్వే జీఎం జైనుల్ ఆబిదీన్‌ను శనివారం ఘనంగా సన్మానించారు. జీఎం కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో సర్వే జీఎంను ఆర్జీ–1 జీఎం చింతల శ్రీనివాస్ పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో ఎస్ఓటూ జీఎం రాంమోహన్, పర్సనల్ ఏజీఎం లక్ష్మీనారాయణ, సర్వే అధికారి ప్రభాకర్, ఆంజనేయప్రసాద్, శ్రీనివాస్ రవీందర్, సారంగపాణి, జితేందర్‌సింగ్, రవీందర్‌రెడ్డి ఇతర అధికారులు పాల్గొన్నారు.

లారీ ఢీకొని వ్యక్తికి తీవ్ర గాయాలు

మల్యాల(చొప్పదండి): లారీ ఢీకొన్న ఘటనలో ఓ వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. ఎస్సై అబ్దుల్ రహీం కథనం ప్రకారం.. చిగురుమామిడి మండలానికి చెందిన సంపత్‌రెడ్డి శుక్రవారం కొండగట్టు ఆంజనేయస్వామి దర్శనానికి వచ్చాడు. రాత్రి ముత్యంపేట శివారులోని పంచముఖ ఆంజనేయ స్వామి సమీపంలో రోడ్డు దాటుతుండగా, లారీ వేగంగా వచ్చి, ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో అతను తీవ్రంగా గాయపడ్డాడు. డ్రైవర్ అజాగ్రత్తగా లారీ నడపడం వల్లే సంఘటన జరిగిందని బాధిత కుటుంబసభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

ప్రేమ పేరిట డబ్బులు వసూలు

- యువకులతో సన్నిహితంగా ఉన్నప్పుడు వీడియో రికార్డు
- తర్వాత బ్లాక్‌మెయిల్
- జగిత్యాలలో ఓ మహిళ నిర్వాకం
- ఫిర్యాదు చేసేందుకు జంకుతున్న బాధితులు

జగిత్యాల క్రైం: ఓ మహిళ డబ్బు, పలుకుబడి ఉన్న వారితో స్నేహం చేస్తూ, ప్రేమ పేరిట డబ్బులు వసూలు చేస్తున్నట్లు తెలిసింది. ఇవ్వకపోతే వారితో సన్నిహితంగా ఉన్న వీడియోలను చూపిస్తూ బ్లాక్ మెయిల్ చేస్తున్నట్లు సమాచారం. జగిత్యాల జిల్లా కేంద్రంలో నివసించే ఓ మహిళ పలువురు యువకులతో స్నేహం చేసింది. ప్రేమాయాణం సాగించి, ఇంటికి పిలిపించుకొని, వారితో సన్నిహితంగా ఉన్నప్పుడు వీడియో రికార్డు చేసింది. తర్వాత తన అవసరాల కోసం డబ్బులు అడగడం ప్రారంభించింది. అడిగినప్పుడు డబ్బు ఇవ్వకున్నా, రమ్మన్నప్పుడు వెళ్లకున్నా ఆ వీడియోలు చూపిస్తూ బ్లాక్ మెయిల్ చేస్తోంది. ఇలా గత ఆరు నెలల్లో ఆమె బాధితులు 6 నుంచి 8 మంది ఉన్నట్లు తెలిసింది. ఆమె వేధింపులు భరించలేక ఒకరిద్దరు తమ సెల్ ఫోన్ నంబర్లు మార్చుకోగా మిగతావారు ఆమె చెప్పింది చేస్తూ నిత్యం ఆందోళన చెందుతున్నట్లు సమాచారం. మహిళ మోజులో పడినవారు ఆమె వేధింపులను భరిస్తున్నారు. కానీ, పోలీసులకు ఫిర్యాదు చేసేందుకు జంకుతున్నారు. బాధితుల్లో ఒకరిద్దరి భార్యలకు ఈ విషయం తెలిసి, ఆ మహిళతో గొడవపడినట్లు తెలిసింది.

తల్లిచెంతకు తప్పిపోయిన బాలిక

- తల్లికి తెలియకుండా తీసుకెళ్లిన తండ్రి
- వెతికి పట్టుకున్న పోలీసులు

కరీంనగర్‌క్రైం: తప్పిపోయిన బాలికను కరీంనగర్ టూటౌన్ పోలీసులు శనివారం రాత్రి తల్లి చెంతకు చేర్చారు. ఉత్తరప్రదేశ్ బస్తీ జిల్లాకు చెందిన షేర్ అలీ–నూర్ కొన్నేళ్ల క్రితం బొమ్మకల్‌కు వచ్చారు. పెయింటింగ్ పనిచేస్తూ షేర్‌అలీ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఇటీవల భార్యాభర్తలు గొడవపడ్డారు. భార్య ఇంట్లో నుంచి వెళ్లిపోయి కూతురితో కలిసి మాతాశిశు ఆసుపత్రిలో ఉంటోంది. శనివారం సాయంత్రం తల్లి నూర్‌కు పాప అమీనా ఖాతూన్ కనిపించలేదు. దీంతో ఆమె సమీపంలోని కరీంనగర్ టూటౌన్ పోలీసులను ఆశ్రయించింది. కరీంనగర్ టౌన్ ఏసీపీ నరేందర్, టూటౌన్ ఇన్‌స్పెక్టర్ విజయకుమార్ సిబ్బందితో కలిసి దర్యాప్తు ప్రారంభించారు. టెక్నాలజీ ఉపయోగించి ఆసుపత్రికి సమీపంలోనే పాప అమీనా ఖాతూన్ తండ్రి షేర్ అలీతో ఉందని గుర్తించారు. తండ్రిని విచారించగా భార్యకు తెలియకుండా కూతురిని తానే తీసుకెళ్లాడని అంగీకరించాడు. తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ నిర్వహించి పాపను అప్పగించినట్లు ఏసీపీ నరేందర్ తెలిపారు. దర్యాప్తులో పాల్గొన్న ఇన్‌స్పెక్టర్ విజయ్ కుమార్, పోలీసులను అభినందించారు.



బాలికను తల్లికి అప్పగిస్తున్న కరీంనగర్ టౌన్ ఏసీపీ నరేందర్, సీఐ విజయ్‌కుమార్